# ముద్దు ముద్దుగా ఇద్దరు

నల్లని వాన్, దానికి రెండు పక్కల్నీ తెల్లని బొమ్మలు - భార్యాభర్తలవీ, ఇద్దరు పిల్లలవీ - ఒక ఆడ, ఒక మగ, బొమ్మల క్రింద ఎర్రత్రికోణం. తలక్రిందుగా, దాని కింద తెల్లని నినాదం "ముద్దుముద్దుగా ఇద్దరు." మనవాళ్ళయ్యకి ఆ నినాదం అంటే మహాఇష్టం. కుటుంబ నియంత్రణోద్యమానికి అతను అనుగ్రహించింది ఆ నినాదం.

మనవాళ్ళయ్యకి కుటుంబ నియంత్రణ శాఖలో మంచి ఉద్యోగం దొరకడానికి ముఖ్యమయిన అర్హత - పదేళ్ళయి పెళ్ళయినా అతనికి పిల్లలు కలగలేదు. అసలు పిల్లల్ని కనకుండా వుండడమే దేశభక్తులైన దంపతుల విధి అని అతని నమ్మకం. పిల్లల్ని కనడం హత్య అంతటి పెద్ద నేరమని కూడా.

అయితే, అతని గొప్ప లక్ష్యానికి గొడ్డలిపెట్టులాగ, కంటిలో నలుసులాగ, కాలిముల్లులాగ, వ్యాన్ డ్రైవర్ పెంటయ్య తయారయాడు. వాడికి ఎనమండుగురు పిల్లలు. రాబోయే తొమ్మిదో శాల్తీకాక, వాణ్ణి శిక్షించడానికి గాని కనీసం మరో శాఖకి బదిలీ చేయించడానికిగాని, మనవాళ్ళయ్యకి అధికారం లేదు. ప్రచారానికి పొరుగూరుపోయి, జనాన్ని పోగుచేసి జోరైన ధోరణిలో ప్రసంగం ప్రారంభిస్తాడు మనవాళ్ళయ్య. భీష్ముడికి శిఖండిలాగ పెంటయ్య కంటపడేసరికి, అతని వీరావేశం అంతా నీరుగారిపోతుంది.

అంతకన్న ఘోరం, పెంటయ్య మకాం తన ఇంటిపక్కనే. వాడి పెళ్ళాం సీతాలు తన ఇంట్లో పనిమనిషి పైగా, ఇంకా తెల్లవారకుండానే అది పిల్లలకోడిలాగ ఎనమండుగురు బలగంతోటీ వచ్చి తలుపు తట్టుతుంది. మరో పెద్ద అసందర్భం మనవాళ్ళయ్య భార్య ఆండాళ్ళకి సీతాలంటే గౌరవం. దీని ఆఖరిపిల్ల, ఎనిమిది నెల్ల చంటికి, తానే నీళ్ళుపోసి, తలదువ్వి పాలు పట్టిస్తుంది.

పెంటయ్య గుడిసె వేసుకున్న స్థలం ఎవరో ఆసామిది. పెంటయ్యని లేవగొట్టి ఆ స్థలం అమ్మడానికి ఆసామీ పదేళ్ళుగా ప్రయత్నిస్తున్నాడు. ఆరునెల్లకోసారి తను వున్నానని రుజువు చేసుకోడానికి అమీనాతో వస్తుంటాడు. సీతాలూ, ఎనమండుగురు పిల్లలూ అతను ఖూనీ చెయ్యడానికి వొచ్చినట్టు గోలపెట్టేస్తారు. పేట పేటంతా చేరతారు. ఆసామీ దోషిలాగ తోకజాడించి వెళ్ళిపోతాడు. దీనికి వాళ్ళకి పూర్తి మద్దతు పోలీసెంకటసామి.

ఎంకటసామికీ పెంటయ్య కుటుంబానికిగల అనుబంధం ఏమిటో చాలాకాలం వరకూ మనవాళ్ళయ్యకి అర్థం కాలేదు. సాయంత్రం ఏడయే సరికి పెంటయ్యా, వాడూ కలిసి కల్లుపాకకి అన్నదమ్ములంత అన్యోన్యంగా పోతారు. పదిగంటలవేళ పిల్లీ కుక్కలాగ, కీచులాడుకుంటూ తిరిగివస్తారు. సీతాలు తన వాడినోటితో ఎంకటసామిని హడలగొట్టేసి తరిమేస్తుంది.

ఒకరోజు, మనవాళ్ళయ్య టూర్‌నించి తిరిగొచ్చేసరికి ఇంట్లో కురుక్షేత్రం సాగుతోంది. ఎంకటసామి పోలీసు లాఠీ ఊపుతూ "నడండే టేసునుకి నడండి, మీరిద్దరూ"

అని అరుస్తున్నాడు సీతాలునీ, దాని పెద్దకూతురు రామినీ ఉద్దేశించి, రామి గొంతెత్తి ఏడుస్తూనే "నీ జిమ్మడ" అని తిడుతోంది. సీతాలు ఆండాళ్ళుతో అతి దీనంగా చెప్పుకుంటోంది. తాము ఏ పాపం ఎరగమని, సంగతేమిటని విచారించగా, స్నానం చేసినప్పుడు ఆండాళ్ళు బాత్‌రూంలో మరిచిపోయిన గొలుసు తిరిగి వెళ్ళి చూస్తే కనబడలేదట. అది బంగారు గొలుసు కాదనీ, పాతిక రూపాయలకన్నా చెయ్యదనీ వాళ్ళని వొదిలెయ్యమనీ ఆండాళ్ళు ఎంకటసామిని బతిమాలుతోంది. "కరీదెంతయినా దొంగతనం దొంగతనవే. ఇయ్యాల ఒగ్గితే రేపు బంగారం గొలుసట్టుకుపోతారు - ఈల్లని బొక్కలో తొయ్యాల్సిందే - నడండే" అంటున్నాడు ఎంకటసామి.

మనవాళ్ళయ్యని చూడ్డంతోటే సీతాలు "ఈడసలు దొంగనాయాలు బాబో. టేషనుకట్టుకుపోయి గుడ్డలిప్పించేసి మమ్మల్ని అల్లరిపెట్టేత్తాడు కావాలంటే తమరే సూసుకోండి. దొంగసొమ్ము మాకాదుందేమో - రామో - నీ బట్టలిప్పు - అయ్యగార్ని సూసుకోమను, తప్పులేదు. తండ్రిలాంటోరు", అని సీతాలు తన పైట జారుస్తూ కూతుర్ని ప్రోత్సహించింది. రామికూడా పైట జార్చి చీర విప్పబోతోంది. ఆండాళ్ళుకి నోట మాట రాలేదు. మనవాళ్ళయ్య బిత్తరపోయి చూస్తున్నాడు. అతనికి నిజంగా విప్పేస్తారేమో అన్న అనుమానం, భయం, ఆత్రం, ఆశ.

భార్య అతని వంక చూసిన చూపులో ఏవగింపు అతన్ని నేలమీదికి తీసుకొచ్చింది. "ఆపండి సిగ్గులేదూ, పోండి మీరంతా అవతలికి పోండి. నీకు బుద్ధిలేదూ? నిన్నెవరు పిలిచారసలు?" అని ఎంకటసామితో సహా వాళ్ళని గదమాయించి అవతలికి పంపేశాడు మనవాళ్ళయ్య. ఎంకటసామి తిక్కగా, "దొంగల్ని పట్టుకుంటే ఆల్లని ఎనకేసు కొచ్చి ఇడిపించేదీ మీరే - దొంగల్ని పట్టుకోలేదని మమ్మల్ని తిట్టేదీ మీరే" అని ఒక విసురు విసిరేసి వెళ్ళిపోయాడు.

సాయంత్రం కూరలు తరిగి పెడుతూ సీతాలు ఆండాళ్లుతో చెప్పుకుంటోంది. "ఆడికి ఎన్నాళ్లుగానో నామీద కన్నమ్మా. ఆడి పెళ్ళాం ఏనాడో తాపీమేస్త్రీతో నెగిసిపోయింది. పెంటయ్య నొగ్గేసి, తనకాడి కొచ్చెయ్యమంటాడు. సచ్చినా రానంటాన్నేను. అందుకే నామీద కసి."

ఎంకటసామి తరచు ఆ ఇంటిచుట్టూ ఎందుకు తిరుగుతున్నాడో కల్లు పాక దగ్గర్నించి వచ్చాక పెంటయ్య, వాడు ఎందుకు కీచులాడుకుంటారో మనవాళ్ళకి కొంతవరకు అర్థమైంది.

ఆ రాత్రి పది గంటలకి పెద్ద గోల. ఏడుపులు. పెడబొబ్బలు, ఇరుగుపొరుగూ జనం జేరారు. జనం చెప్పగా మనవాళ్లయ్య విన్నది.

కల్లు పాక దగ్గర చిత్తుగా తాగి పెంటయ్య తన భార్య మీద దొంగతనం మోపినందుకు. ఎంకటసామిని చితకబాదాడట. ఆ వీరావేశంలో రోడ్డంతా తనదేనన్నట్టు ఇంటికి వస్తుంటే, ఒక బరువైన లారీ తన ఆధిక్యం నిరూపించుకుందంట వెనకాలే అతన్ని బతిమాలుకుంటూ వస్తున్న ఎంకటసామే వాణ్ణి ఆస్పత్రికి చేర్చాడట. కాని దారిలోనే పెంటయ్య కన్ను మూశాడట.

"ఆడి సావుకి నేనే కారణం. నన్ను సంపెయ్యి" అంటూ ఎంకటసామి సీతాలు చేతులు పట్టుకుని ఒకటే గోల.

పదిహేడు రోజులు గడిచిపోయాయి. సీతాలూ, కుటుంబం ఏమయ్యారో మనవాళ్ళయ్యకి తెలియదు, గుడిసె ఖాళీ.

ఒకనాటి సాయంత్రం మనవాళ్ళయ్య ఆండాళ్ళు ఇంటబయటా ఆవరణలో కుర్చీలేసుకు కూర్చున్నారు. సీతాలు ఎనమండుగురు పిల్లలతోటి వచ్చింది. ఆమెను చూసి దంపతులిద్దరూ బిత్తరపోయారు. మొగాన్ని పెద్ద కుంకంబొట్టు, తల్లో పువ్వులు, మెడలో తాలి బొట్టు. సీతాలు చెప్పింది ఎంకటసామి ఒకటే గోలట. పెళ్ళి చేసుకోకపోతే వాడు చచ్చిపోతాడని భయం వేసిందట. క్రితం రోజే తిరుపతిలో పెళ్ళయిపోయిందట.

"మరి రేపట్నించి పన్లో కొస్తావా" అని అడిగింది ఆండాళ్ళు.

"ఎట్టాగమ్మా? ఆడిల్లు ఊరికి ఆ సివర రెండు కోసులు. ఆడనే పదిళ్ళు సూసుకుంటాను" అంది సీతాలు.

ఆండాళ్ళు ముఖం దిగులుతో నల్లబడిపోయింది. భర్తవంక చూసింది. చివరికి తెగించి–

"ఇంతమంది పిల్లలు నీకు బరువు కాదుటే? మీ చంటిదాన్ని నా కిచ్చెయ్యి" అని అడిగింది.

"అమ్మో? నా మొగుడు సంపెయ్యడూ? అడికిదంటే మా ముద్దు" అంది సీతాలు చంటిదాన్ని మరింత గట్టిగా హత్తుకుంటూ, తరవాత అంది:

"బిడ్డలు మా బోటోలకి బరువేంటమ్మా? అయ్యగారేమో బిడ్డలుండకూడదంటారు. ఆరి ఉద్యోగం అంది. మరి రైటే అనుకోండి. మీలాంటి ఆఫీసర్లకి శానమంది బిడ్డలుంటే జీతాలు సాలవు. మాలాంటి కూలోల్లకి ఎంతమంది బిడ్డలుంటే అంత సుఖం. అయిదేల్లొచ్చీదాకా బిడ్డని మేం సాకితే, ఆ తరవాత అది మమ్మల్ని సాకుతాది. ఇంతమంది వుండమట్టే పదిళ్ళు సేసుకుంటున్నాం. ఆరేడొందలు సంపాయిస్తున్నాం. మరి ఇద్దరికన్నా వొద్దంటే మేం బతికేదెట్టా?"

సీతాలు పిల్లలతోసహా వెళ్ళిపోయాక చాలాసేపు మనవాళ్ళయ్య ఆలోచిస్తూ కూర్చున్నాడు. సీతాలు వాదంలో పెద్దపొరపాటుంది కాని సీతాలుని ఎలా ఒప్పించటం? ఆమెలాంటి వాళ్ళని ఒప్పించలేకపోతే తన ప్రచారానికి ఫలితం ఏముంది?

చుట్టూ నిశ్శబ్దం, చెప్పరాని వెలితి. మనవాళ్ళయ్య, ఆండాళ్ళు చీకటిపడ్డా లేవలేదు, అలాగే కూర్చున్నారు ఇద్దరూ, ఎవరి ఒంటరితనంలో వాళ్ళు మునిగిపోయి.

ఎదురుగా, నల్లని వాన్ మీద, తెల్లని అక్షరాల్లో కూడా మెరుస్తోంది "ముద్దుముద్దుగా ఇద్దరు" అన్న నినాదం – ఆర్తనాదంలాగ.

**(ఆంధ్రజ్యోతి డెయిలీ – 26.3.82)**